31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

మంగళవారం, ఆగస్టు 25, 2026 పేజీలు : 8

## అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తాం

### రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



**చురకలు విలేకరి, ధర్మపురి, ఆగస్టు 24:** పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆహార భద్రత కల్పించడంతో పాటు అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణంలో తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొని లబ్ధిదారు లకు కార్డులను అందజేశారు. ఈ సంద ర్భంగా మంత్రి మాట్లాడుతూ ధర్మపురి పట్టణంలోని 8 రేషన్ షాపుల పరిధిలో మొత్తం 5,407 నూతన స్మార్ట్ రేషన్ కార్డులను లబ్దిదారులకు -మిగతా 2లో

### పిల్లలు ఆకలితో

# పాఠశాలకు వెళ్లే పరిస్థితి ఉండకూడదు

- పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- పిల్లల ఆరోగ్యం, శారీరక ఎదుగుదలతో పాటు చదువుపై ఏకాగ్రత పెంచేందుకు అల్పాహార పథకం
- రూ.7.5 కోట్ల సింగరేణి సీఎస్ఆర్ నిధులతో ఆధునిక సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటు.. గంటలో 10 వేల ఇడ్లీలు, 3 వేల దోసెలు, 5,600 పూరీలు తయారు చేసే సామర్థ్యం గల కిచెన్ ప్రారంభించిన మంత్రి








**చురకలు ప్రతినిది, కమాన్ పూర్ (మంథని) ఆగస్టు 24:** పిల్లలు ఆకలితో పాఠశాలకు వెళ్లే పరిస్థితి ఉండకూడదని, ప్రతి ప్రభుత్వ పాఠశాల విద్యార్థికి పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించి వారి ఆరోగ్యం, శారీరక ఎదుగుదలతో పాటు చదువుపై ఏకాగ్రత పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. మంథనిలో సింగరేణి సంస్థ సీఎస్ఆర్ నిధులతో సుమారు రూ.7.5 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం కిచెన్‌లో తయారు చేసిన అల్పాహారాన్ని విద్యార్థులతో కలిసి మంత్రి స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ 2011లో హరే రామ హరే కృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆసుపత్రుల్లోని రోగుల సహాయకులకు ఆహారం అందించే కార్యక్రమం ప్రారంభమైందని తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ కార్యక్రమం అమలు అవుతోందన్నారు. హరే రామ హరే కృష్ణ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఏ.సి. భక్తి వేదాంత స్వామి ప్రభుపాద 10 మైళ్ల పరిధిలో ఒక్కరు కూడా ఆకలితో ఉండకూడదనే సందేశం తెలంగాణ ప్రభుత్వానికి స్ఫూర్తిగా నిలిచిందని మంత్రి తెలిపారు. హరే రామ హరే కృష్ణ చారిటబుల్ ట్రస్ట్‌తో సమన్వయం చేసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఆహార భద్రత కల్పించే కార్యక్రమాలను చేపడుతోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో తొలుత కొడంగల్ నియోజకవర్గంలో ప్రయోగాత్మకంగా పాఠశాల విద్యార్థులకు అల్పాహార పథకాన్ని ప్రారంభించామని మంత్రి తెలిపారు. ఈ పథకం అమలుతో కొడంగల్ నియోజకవర్గంలో పాఠశాల విద్యార్థుల హాజరు 21 శాతం పెరిగిందని పేర్కొన్నారు. ప్రస్తుతం కొడంగల్, మధిరలో -మిగతా 2లో

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత

### రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



**చురకలు విలేకరి, ధర్మపురి, ఆగస్టు 24 :** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సోమవారం ధర్మపురి మండలం గాదెపెల్లి గ్రామంలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. జాతీయ ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా సుమారు రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన మహిళా సంఘ భవనాన్ని, సుమారు రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళా సంఘాలను బలోపేతం చేసి, మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. నూతన గ్రామ పంచాయతీ కార్యాలయం అందుబాటులోకి రావడంతో ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా, వేగంగా అందుతాయని పేర్కొన్నారు. గ్రామాల



అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజల సమస్యలను -మిగతా 2లో

### నూతన సాంకేతిక వ్యవస్థలపై

## పూర్తి అవగాహన కలిగి ఉండాలి





**చురకలు ప్రతినిధి, జగిత్యాల / కొడిమ్యాల, ఆగస్టు 24:** నూతన సాంకేతిక వ్యవస్థలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. పోలీస్ శాఖలో సేవల నాణ్యతను మరింత మెరుగుపరచడం, ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన పోలీసింగ్ అందించడం, నేరాల నియంత్రణ, నేరాల ఛేదన, కేసుల దర్యాప్తు నాణ్యత, రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యలను సమీక్షించేందుకు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సోమవారం కోడిమ్యాల పోలీస్ స్టేషన్ను వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదవుతున్న కేసులు, పెండింగ్ కేసుల పురోగతి, దర్యాప్తు విధానం, నేరాల నియంత్రణ చర్యలు, స్టేషన్ నిర్వహణ, రికార్డుల నిర్వహణ అంశాల ను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి కేసును శాస్త్రీయ -మిగతా 2లో

## ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తుంది

**-జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్**




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 24 :** ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అన్నారు. సోమవారం జగిత్యాల రూరల్ మండలం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. ప్రజల నుండి అందుతున్న వినతులు, ఫిర్యాదుల స్వీకరణ విధానాన్ని పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉదేశ్యం తో గత వారం నుండి మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాలు ప్రారంభించిందన్నారు. ఈ నేపథ్యం లో ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును సకాలంలో పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సానుభూతితో విని, శాఖల వారీగా సమన్వయం చేసుకుని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలకు న్యాయం చేకూరేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో రమా దేవి, తహసీల్దార్ షాదాబ్ హకీమ్, సంబంధిత అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మంత్రిని ఆహ్వానించిన సీనియర్ జర్నలిస్ట్



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ (రామగిరి) ఆగస్టు 24 :** రామగిరి మండలం బేగంపేట చెందిన సీనియర్ జర్నలిస్ట్, నమస్తే తెలంగాణ విలేకరి బుర్ర తిరుపతి గౌడ్ కుమార్తె వివాహానికి హాజరు కావలసిందిగా ఆహ్వాన పత్రాన్ని రాష్ట్ర ఐటీ పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు అందజేశారు. ఈనెల 27న సెంటినరీ కాలనీలోని కమ్యూనిటీ హాల్ లో బుర్ర మౌనిక వివాహం హైదరాబాద్ చెందిన దుష్యంత్ గౌడ్‌తో జరగనుంది. ఈ వివాహ మహోత్సవానికి తప్పకుండా హాజరవుతానని రాష్ట్ర ఐటీ, పరిక్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. కమన్పూర్ పర్యటనకు విచ్చేసిన మంత్రి శ్రీధర్ బాబును బుర్ర తిరుపతి గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి తన కుమార్తె వివాహనికి ఆహ్వానించారు. ఆహ్వానాన్ని స్వీకరించిన మంత్రి,వివాహ వేడుకకు తప్పకుండా హాజరవుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతి యాదవ్, రామగిరి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బొల్జారం విజయానంద రావు, సీనియర్ జర్నలిస్ట్ మల్యాల రమేష్ గౌడ్ పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ....

**మొదటి పేజీ తరువాయి.....** పంపిణీ చేస్తు న్నట్లు తెలిపారు. అర్హత ఉన్న ఏ ఒక్క కుటుంబం ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. నూతన స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా లబ్దిదారులకు రేషన్ సరుకులు పొందడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు మరింత సులభంగా అందే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి వారికి మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి అన్నారు. పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ ఆహార భద్రత, సామాజిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. కార్డులు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్కు కృతజ్ఞతలు తెలిపారు. పౌరసరఫరాల శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# పిల్లలు ఆకలితో...

**మొదటి పేజీ తరువాయి....**కూడా అల్పాహార పథకం అమలు చేస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్‌కు ఇచ్చిన సూచనల మేరకు సింగరేణి సంస్థ సీఎస్ఆర్ నిధులతో సుమారు రూ.7.5 కోట్ల వ్యయంతో మంథనిలో ఆధునిక యంత్రాలతో ఈ సెంట్రలైజ్డ్ కిచెన్‌ను ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. ఇక్కడ గంటలో 10 వేల ఇడ్లీలు, 3 వేల దోసెలు, 5,600 పూరీలు తయారు చేసే సామర్థ్యం ఉందన్నారు. విద్యార్థులకు ప్రతిరోజూ విభిన్న రకాల అల్పాహారం అందించేలా ప్రత్యేక మెనూను రూపొందించామని మంత్రి తెలిపారు. వారానికి కనీసం మూడు సార్లు విద్యార్థులకు పాలు అందించే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నామని అన్నారు. పిల్లలకు ప్రతిరోజూ ఒకే రకమైన ఆహారం కాకుండా వివిధ రకాల టిఫిన్లను అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకున్న మంత్రి, వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ఒక విద్యార్థిని గతంలో ఆహారం లేకుండానే పాఠశాలకు హాజరయ్యే పరిస్థితి ఉండేదని తన కష్టాలను మంత్రితో పంచుకుంది. ఇలాంటి పరిస్థితులను విద్యార్థులు ఇకపై ఎదుర్కోకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. పోషకాహారంతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల విద్యార్థులు చదువుపై మరింత ఏకాగ్రత సాధించడంతో పాటు మంచి ఆరోగ్యం, శారీరక ఎదుగుదల పొందుతారని మంత్రి అన్నారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అల్పాహార పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచనల మేరకు జిల్లాలో విద్యాశాఖకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన అధ్యయనాల ప్రకారం విద్యాశాఖకు సంబంధించిన వివిధ కార్యక్రమాల అమలులో పెద్దపల్లి జిల్లా రాష్ట్రంలో 3వ స్థానంలో నిలిచిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యపై ప్రత్యేక దృష్టి సారించి కొత్త ఉపాధ్యాయులను నియమించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తోందని కలెక్టర్ తెలిపారు. తాజాగా ప్రారంభించిన అల్పాహార పథకం ద్వారా విద్యార్థుల ఆరోగ్యం, హాజరు, విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని పేర్కొన్నారు. జిల్లాలో ఉపాధ్యాయులు చేస్తున్న మంచి పనికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభిస్తోందని కలెక్టర్ తెలిపారు. ఇటీవల రామగుండం ప్రాంతానికి చెందిన ఒక ఉపాధ్యాయుడు ఫిన్‌లాండ్‌లో శిక్షణా కార్యక్రమానికి ఎంపికయ్యారని, భవిష్యత్తులో మరింత మంది ఉపాధ్యాయులు విదేశాల్లో శిక్షణ పొందేలా అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని కలెక్టర్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన ఆహారం, నాణ్యమైన విద్య ఉచితంగా అందుతున్నందున తల్లిదండ్రులు ఎలాంటి సందేహాలు లేకుండా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసి విద్యార్థుల భవిష్యత్తుకు పటిష్ట పునాది వేయడమే లక్ష్యంగా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మంథని ఆర్డీవో సురేష్, మంథని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ సయేందర్ రెడ్డి, మంథని మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకన్న, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్, తహసిల్దార్ ఆరిపోద్దిన్, మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, విద్యుత్ నియంత్రణ మండలి సభ్యులు న్యాయవాది శశుభూషణ్ కాచే, మంథని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అయిలి ప్రసాద్, నాయకులు మంథని సత్యం, ఎరుకల ప్రవీణ్, సాధుల శ్రీకాంత్, సోషల్ మీడియా ఇన్చార్జి ఆరేళ్ళి కిరణ్ గౌడ్ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన సాంకేతిక వ్యవస్థలపై...

**మొదటి పేజీ తరువాయి...** ఆధారాలతో విచారించి, నాణ్యమైన దర్యాప్తుతో త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. స్టేషన్లో నిర్వహిస్తున్న రిజిస్టర్లు, రికార్డులు, సిబ్బంది విధుల కేటాయింపు, కార్యాలయ నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. ప్రజల సమస్యలపై వెంటనే స్పందిస్తూ బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 5ఎస్ విధానంలో భాగంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పోలీస్ సిబ్బంది యూనిఫాం నీట్ టర్న్ అవుట్తో ఉండాలని, క్రమశిక్షణ, సమయపాలనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం సిబ్బందితో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకుని, అవసరమైన సూచనలు చేశారు. నూతన సాంకేతిక పరిజ్ఞానం పై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని, ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించాలని ఎస్పీ సూచించారు. డయల్-112 కు వచ్చే ప్రతి కాల్పై వెంటనే స్పందించి, సంఘటన స్థలానికి అత్యంత వేగంగా చేరుకుని బాధితులకు తక్షణ న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాత నేరస్తులపై నిరంతర నిఘా కొనసాగించాలని, వారిని ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ నేరాల నివారణకు కృషి చేయాలని సూచించారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్లు తమకు కేటాయించిన గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలని తెలిపారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాల నియంత్రణలో కలిగే ప్రయోజనాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలు, డిజిటల్ చెల్లింపుల భద్రత, మోసగాళ్లు అనుసరిస్తున్న కొత్త పద్ధతులపై ప్రజలను చైతన్యపరిచి, అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, సీఐ రాజ్ కుమార్, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సై నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత

**మొదటి పేజీ తరువాయి...** ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మంత్రి సూచించారు. గాదె పెల్లి గ్రామానికి అవసరమైన మరిన్ని అభివృద్ధి పనులను చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా గ్రంథాలయ చైర్మన్ సంగనబట్ల దినేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

**నిరు పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నాం..**

ధర్మపురి మండలం కమలాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో సోమవారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్హులైన పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మండలస్థాయి ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

**చురకలు ప్రతినిధి, ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 24 :** అన్ని ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే మండల స్థాయి ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంతోపాటు ఆయా రెవెన్యూ డివిజన్ల కార్యాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రజావాణి కొనసాగుతుండగా, ఎలారెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ శాఖల మండల స్థాయి అధికారుల హాజరును పరిశీలించారు. గత వారం ప్రజావాణికి ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? తదితర అంశాలపై ఆరా తీశారు. చేయూత నూతన పెన్షన్ ల కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. ఆయా దరఖాస్తులను పరిశీలించారు.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**-రూ.1.63 లక్షల నగదు, పేక ముక్కలు, మొబైల్ ఫోన్లు స్వాధీనం**

**చురకలు ప్రతినిధి కోరుట్ల, ఆగస్టు, 24 :** కోరుట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని గుమ్లాపూర్ గ్రామంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి నిర్వహించారు. ఆదివారం రాత్రి సుమారు 8:45 గంటల సమయంలో ఓ ఇంట్లో డబ్బులు పందెంగా పెట్టి మూడు ముక్కల పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఈ దాడి చేపట్టారు. కోరుట్ల పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి. శ్యామ్ రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడిలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి పేకాటకు పందెంగా ఉపయోగిస్తున్న రూ.1,63,100 నగదు, 52 పేక ముక్కలు, 5 మొబైల్ ఫోన్లను పంచనామా ద్వారా స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై సంబంధిత వ్యక్తులపై గేమింగ్ యాక్ట్ నిబంధనల ప్రకారం కేసు నమోదు చేసి, తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. జూదానికి దూరంగా ఉండాలి పోలీసులు డబ్బులు పందెంగా పెట్టి పేకాట, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కోరుట్ల పోలీసులు హెచ్చరించారు. ప్రజలు ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, తమ పరిసరాల్లో పేకాట లేదా జూదం నిర్వహిస్తున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

# అంతర్ జిల్లా దొంగ అరెస్టు

**-వివరాలు వెల్లడించిన సీఐ కరుణాకర్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 24 :** జగిత్యాల పట్టణంలో వరుస చోరీలకు పాల్పడిన మెట్ పల్లికి చెందిన అంతర్ జిల్లా దొంగ షేక్ సలీం అలియాస్ ఉస్మాన్ను జగిత్యాల టౌన్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీఐ కరుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని విద్యానగర్ బైపాస్ లో ఎస్ఐ ఎం. సుప్రియ సిబ్బందితో కలిసి నిందితుడిని పట్టుకున్నారని, విచారణలో 5 చోరీలకు పాల్పడినట్లు అంగీకరించాడని తెలిపారు. అతని వద్ద నుండి 23 గ్రాముల బంగారు నగలు, 50 గ్రాముల వెండి, మువ్వల హారం, ల్యాప్ టాప్ స్వాధీనం చేసుకున్నారని, నిందితుడిని రిమాండ్ కు తరలించినట్లు ఇన్ స్పెక్టర్ పి.కరుణాకర్ తెలిపారు.

# అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులకు నూతన యూనిఫాంల పంపిణీ



**చురకలు ప్రతినిధి కోరుట్ల, ఆగస్టు 24 :** కోరుట్ల పట్టణంలోని 4వ వార్డు అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు నూతన యూనిఫాంల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్పర్సన్ తిరుమల వసంత గంగాధర్ హాజరై, స్థానిక వార్డు కౌన్సిలర్ తెడ్డు శ్రీజ, తెడ్డు విజయ్‌తో కలిసి చిన్నారులకు ఉచితంగా నూతన యూనిఫాంలను అందజేశారు. అనంతరం పలువురు చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ తిరుమల వసంత గంగాధర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు ప్రభుత్వం పౌష్టికాహారంతో పాటు అవసరమైన సదుపాయాలను కల్పిస్తోందన్నారు. అందులో భాగంగానే ఉచిత యూనిఫాంలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం, ఉచిత యూనిఫాంలు తదితర సదుపాయాలను ప్రతి చిన్నారి సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, స్థానిక నాయకులు తెడ్డు విజయ్, అంగన్వాడీ కేంద్ర నిర్వాహకులు, చిన్నారులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

### అధికారుల సమన్వయంతో

# భూముల రీసర్వే వేగంగా పూర్తి చేయాలి



**-భూభారతి, సాదాబైనామా పై ప్రత్యేక దృష్టి సారించాలి**
**-ప్రతి రోజు 40 ఎకరాల భూమి ని రీ సర్వే చేయాలి**
**-విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు**
**-జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్**

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 24 :** జిల్లాలో భూముల రీ సర్వే ప్రక్రియను రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు సమన్వయం తో వేగంగా ప్రతి రోజు 40 ఎకరాల భూమిని రీ సర్వే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ ఆదేశించారు. భూముల రీసర్వే ప్రక్రియ, భూ భారతి, సాదాబైనామా తదితర అంశాల పై జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ బి.ఎస్. లత, రెవెన్యూ, సర్వే అధికారులతో కలిసి సమీక్షత జిల్లా కార్యాలయాల సముదాయంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. భూముల రీ సర్వే ప్రక్రియలో భాగంగా ఆయా మండలాలలో ఎన్ని ఎకరాలు చేశారో, అందులో ప్రభుత్వ, పట్టా, భూములు ఎన్ని ఎకరాలు గుర్తించారో వంటి వివిధ అంశాల పై తహసీల్దార్లు, సర్వేయర్లను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ మాట్లాడుతూ భూముల రీ సర్వే ప్రక్రియ మార్చి 2026 లో ప్రారంభం చేసినప్పటికీ ఇప్పటి వరకు పనుల్లో నెమ్మదిగా కొనసాగడం పై జిల్లా కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. భూముల వివరాలను క్షేత్రస్థాయిలో పక్కాగా సేకరించాలని, లక్ష్యం నిర్దేశించుకుని, రీ సర్వే వేగంగా పూర్తి పారదర్శకత తో పూర్తి చేయాలని, సర్వే చేసిన గ్రామాల రికార్డులు సంబంధిత తహసీల్దార్లకు అందజేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల్లో సర్వే చేసే ముందు ఆయా భూముల సర్వే నంబర్ల వివరాలు జీ.పీ.ఓ.లు, పంచాయతీ కార్యదర్శుల ద్వారా భూముల సమాచారం చేరవేయాలని తెలిపారు. గ్రామ సరిహద్దుల రీ సర్వే, ఇతర పనులను తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో నిత్యం పరిశీలించాలని సూచించారు. గ్రామ సరిహద్దుల రీ సర్వే చేసేప్పుడు వివిధ శాఖల (వ్యవసాయ, ఇరిగేషన్, అటవీ ) అధికారులు పాల్గొనేలా చూడాలని ఆదేశించారు. సర్వే పూర్తి వివరాలు క్షేత్రస్థాయి, రికార్డులలో పరిశీలించిన తర్వాత మిగతా ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ భూముల గుర్తింపు, పరిరక్షణ పక్కాగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి తహసీల్దార్ తమ పరిధిలోని కార్యాలయ సిబ్బంది, సర్వే అధికారులతో భూముల రీ సర్వే, భూ భారతి, సాదాబైనామా ప్రక్రియ పై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. నిబంధనలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, తహసీల్దార్లు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, ఆయా మండలాల సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# మెట్‌పల్లిలో ఘనంగా వన మహోత్సవం

**-ఇంటింటికీ మొక్కల పంపిణీ ప్రారంభం**



**చురకలు విలేకరి, మెట్‌పల్లి, ఆగస్టు 24 :** పర్యావరణ పరిరక్షణతో పాటు మెట్‌పల్లి పట్టణాన్ని హరితమయంగా తీర్చిదిద్దే లక్ష్యంతో నిర్వహిస్తున్న వన మహోత్సవంలో భాగంగా ఇంటింటికీ మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మైలారపు లింబాద్రి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. పట్టణంలో పచ్చదనం పెంపొందించడం ద్వారా స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని అన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే హరిత మెట్‌పల్లిని సాధించగలమని పేర్కొన్నారు. వన మహోత్సవంలో భాగంగా ప్రతి ఇంటికి ఆరు మొక్కల చొప్పున గౌరవ కౌన్సిలర్ల ద్వారా ఆయా వార్డుల్లో పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మొక్కలు కావాల్సిన ప్రజలు రేగుంట నర్సరీకి వెళ్లి కూడా మొక్కలను పొందవచ్చని సూచించారు. మొక్కలను నాటడంతో పాటు వాటిని నిరంతరం సంరక్షించి పెంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు బత్తుల నరేష్, గుడికందుల అజయ్, ఖాజా అజిముద్దీన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేష్ నాయక్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ విష్ణు, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మహిళలు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలను స్వీకరించారు. హరిత మెట్‌పల్లి నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా నిర్వాహకులు కోరారు.

### గండి హనుమాన్ ఆలయంలో

# వరద పాయసం పూజ



**చురకలు విలేకరి,మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 24 :** మెట్‌పల్లి మండల పరిధి లోని గండి హనుమాన్ దేవస్థానంలో రెండో శ్రావణ సోమవారం సందర్భంగా బండలింగాపూర్ గ్రామస్తులు ఆలయం లో వరదపాయసం పూజా కార్యక్రమాన్ని మాధవచార్యులు సమక్షంలో ఘనంగా జరుపారు.ఈ సందర్భంగా వర్షాలు సమృద్ధిగా కురిసి, చెరువులు,కుంటలు నిండి, రైతులకు సాగునీరు పుష్కలంగా అందాలని,పంటలు బాగా పండి రైతుల కుటుంబాల్లో సంతోషం వెల్లివిరియాలని స్వామివారికి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీ సంజీవ్,ఉపసర్పంచ్ ఆకుల రాకేష్ పటేల్, గ్రామాభివృద్ధి సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

### గంజాయి, డ్రగ్స్‌కు

# యువత దూరంగా ఉండాలి

**-సీఐ బి. సురేష్‌బాబు**




**చురకలు విలేకరి, మెట్‌పల్లి, ఆగస్టు 24 :** గంజాయి, డ్రగ్స్ వంటి నిషేధిత మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని మెట్‌పల్లి సీఐ బి. సురేష్‌బాబు సూచించారు. మత్తు పదార్థాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేయడంతో పాటు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా విద్య, ఉద్యోగం, క్రీడలు, సామాజిక సేవ వంటి సానుకూల కార్యక్రమాలపై దృష్టి సారించాలని కోరారు. మత్తు పదార్థాల వినియోగం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపడంతో పాటు నేర ప్రవృత్తికి దారితీసే అవకాశం ఉందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల నడవడిక, స్నేహితుల వర్గం, రోజువారీ కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. యువతే దేశ భవిష్యత్తు అని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవితాన్ని ఎంచుకోవాలని సీఐ బి. సురేష్‌బాబు యువతకు పిలుపునిచ్చారు.

## సోమేశ్వర కొండకు పోటెత్తిన భక్తులు



**చురకలు విలేకరి,మల్లాపూర్,ఆగస్టు 24 :** మల్లాపూర్ మండల కేంద్రంలోని కనక సోమేశ్వర స్వామి ఆలయానికి శ్రావణ సోమవారం పురస్కరించుకొని భక్తులు పోటెత్తారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రావణ మాసం ఉత్సవాలను ఘనంగా జరుపుతున్నారు.ఈ సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాటు చేయగా పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు స్వామివారిని దర్శించుకొని వరదపాశంతో మొక్కులను తీర్చుకోని ప్రత్యేకపూజలు చేపట్టగా, కొండ కింద భక్తులకు మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త శివ శ్రీనివాస్-మల్లీశ్వరి దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్, విడిసి చైర్మన్ క్యాతం సురేష్ రెడ్డి, మాజీ చైర్మన్ సంగ గంగారాజం, ఉపసర్పంచ్ గడ్డం సోమారెడ్డి, మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మన ఊరు-మన బడి
## పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి




**చురకలు విలేకరి, జగిత్యాల, ఆగస్టు 24 :** మన ఊరు-మన బడి పథకం కింద మూడేళ్లుగా పెండింగ్ లో ఉన్న బిల్లులు తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ స్టేట్ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు.ఈ మేరకు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో జగిత్యాల జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందించారు. అనంతరం కాంట్రాక్టర్లు మాట్లాడుతూ బిల్లులు అందక అప్పుల ఊబిలో కూరుకుపోయి, కొందరు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హామీలు ఇచ్చినా ఇప్పటివరకు నెరవేరలేదన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవం లోపు బిల్లులు విడుదల చేయకపోతే, పనులు పూర్తి చేసిన పాఠశాలలకు తాళాలు వేసి నిరసన తెలుపుతామని హెచ్చరించారు.

## ఎండపల్లిలో రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు చేయాలి



**చురకలు విలేకరి ఎండపల్లి ఆగస్టు 24 :** ఎండపల్లి ప్రజావాణి కార్యక్రమంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు చేయాలని కోరుతూ కొత్తపేట సర్పంచ్ జి.రెడ్డి మహేందర్‌రెడ్డి ఎండపల్లి ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఈ సంఘాన్ని ఏర్పాటు చేయడం ద్వారా రైతులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక ప్రయోజనాలు చేకూరుతాయని తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు, గిట్టుబాటు ధరలు లభించడంతో పాటు రైతుల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సంఘం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**-జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 24 :** ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 53 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా ప్రజావాణికి సంబంధించి ప్రస్తుతం మొత్తం 182 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో 93 దరఖాస్తులు 30 రోజులకు పైగా పెండింగ్‌లో ఉన్నట్లు జిల్లా ప్రజావాణి నివేదికలో వెల్లడైందన్నారు. పెండింగ్ దరఖాస్తుల్లో జిల్లా పంచాయతీ కార్యాలయం వద్ద 28, జగిత్యాల మున్సిపాలిటీ వద్ద 23, జిల్లా ఐ అండ్ క్యాడ్ వద్ద 17, ఎడి ఎస్ఎల్ఆర్ వద్ద 15, మెట్‌పల్లి మున్సి పాలిటీ వద్ద 10, కోరుట్ల మున్సిపాలిటీ వద్ద 9, జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద 9, డిఆర్డిఏ వద్ద 9దరఖాస్తులు ఉన్నాయని తెలిపారు . ప్రజావాణి ద్వారా అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు పరిశీలించి, సమస్యకు పరిష్కారం చూపడంతో పాటు దరఖాస్తుదారులకు తగిన సమాచారం అందించాలని సూచించారు. ముఖ్యంగా 30 రోజులకు పైగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ప్రాధాన్యతగా పరిష్కరించి, ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్. లత, జిల్లా రెవెన్యూ అధికారి ప్రసాద్, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాలలో గుట్టల మాయం

**-అక్రమ మైనింగ్‌తో పర్యావరణ విధ్వంసం**
**-సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి జీవన్ రెడ్డి లేఖ**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 24 :** జగిత్యాల జిల్లాలో ప్రభుత్వ భూములు, గుట్టలలో జరుగుతున్న అక్రమ మైనింగ్ పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి టి. జీవన్ రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అక్రమ మైనింగ్ ను అరికట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణే ప్రధాన బాధ్యతగా, కాలుష్య నివారణకు వనాలతోడుగా మొక్కలు నాటే కార్యక్రమాలు చేపడుతున్న తరుణంలో, జగిత్యాల పట్టణానికి సమీపంలోని నర్సింగాపూర్, తాటిపల్లి, మోరపల్లి, జాబితాపూర్, తిమ్మాపూర్ తదితర ప్రభుత్వ గుట్టల్లో అక్రమ మైనింగ్ తో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని పేర్కొన్నారు. వాల్టా చట్టాన్ని సైతం ఉల్లంఘిస్తూ గుట్టలు, చెరువుల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇటు పర్యావరణ సమతుల్యం దెబ్బతినడంతో పాటు మట్టి తవ్వకాలతో ఏర్పడిన గుంతల్లో, చెరువులు, కుంటలు గిరిజన విద్యార్థులకు మృత్యుపాశాలుగా మారడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మల్యాల మండల కేంద్రంలోని ఒడ్డెర కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు అక్రమ మట్టి తవ్వకాలతో ఏర్పడిన గుంతలో పడి మృతి చెందారని గుర్తు చేశారు. జగిత్యాల పట్టణానికి సరిహద్దులోని తిమ్మాపూర్ రెవెన్యూ గ్రామానికి చెందిన ముప్పాల చెరువు శిఖం ఆంతర్యాగం నింపటంతో మత్స్యకారులకు చేపల పెంపకానికి, విస్తీర్ణం తగ్గటంతో పాటు భూగర్భ జలాలపై కూడా ప్రభావం చూపుతోందని తెలిపారు.జగిత్యాల పట్టణ, పరిసర గ్రామాల మట్టి అవసరాల నిమిత్తం అవసరమైనచో, కరీంనగర్ రోడ్డు వైపు, కోరుట్ల రోడ్డు వైపు ఎస్సారెస్పీ వరద కాలువ ఫ్లడ్ ఫ్లో కెనాల్ తవ్వకంలో కాలువకు 100లాది ఎకరాల మట్టి స్టాక్ పేరుకుపోయిందని, రాజోయే దశాబ్దాల కాలం ఆ మట్టిని వినియోగించినా తరగని మట్టి స్పాయిల్ స్టాక్ అందుబాటులో ఉందని, ఇట్టి వృధాగా గుట్టలుగా పేరుకుపోయిన మట్టిని మైనింగ్ నిబంధనలకు అనుగుణంగా వినియోగించుకునే ప్రయత్నం చేయకుండా గత దశాబ్దకాలంలో చేపట్టబడిన అక్రమ మైనింగ్ వల్ల పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగిందని ఆరోపించారు. గూగుల్ మ్యాప్ లో 2014 నాటి పరిస్థితి, నేటి పరిస్థితిని పరిశీలిస్తే అక్రమ మైనింగ్ ఎంతవరకు పర్యావరణానికి విఘాతం కలిగించిందో గమనించవచ్చని పేర్కొన్నారు. ప్రకృతి వనరులను కాపాడాల్సిన ప్రజాప్రతినిధులు గుట్టలు, మట్టి తవ్వకాలను ప్రోత్సహిస్తుండటంతో పాటు, కొంతమంది ప్రజాప్రతినిధులు కూడా అనుమతులు లేకుండా ప్రొక్లెయిన్, టిప్పర్లతో అక్రమంగా మట్టిని తరలిస్తున్నా రెవెన్యూ, మైనింగ్ అధికారులు చూసిచూడనట్లు వ్యవహరించడం వల్ల అక్రమార్కులు ఇష్టారీతిన తవ్వకాలు చేపడుతూ పర్యావరణాన్ని దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో జగిత్యాల జిల్లా ప్రజల భవిష్యత్ అవసరాల దృష్ట్యా ప్రకృతి వనరులను కాపాడుతున్న అక్రమార్కులపై దృష్టి సారించి, అక్రమ మైనింగ్ ను అరికట్టడంతో పాటు బాధ్యులపై చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి జీవన్ రెడ్డి సీఎంను కోరారు. అక్రమ మైనింగ్ ను అరికట్టాలని ప్రజావాణిలో వినతిపత్రం అందించారు.

# ఇబ్రహీంపట్నంలో ప్రజావాణి




**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం అగష్టు (24) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్ర మాన్ని నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజల సమస్యలను స్థానిక స్థాయిలోనే త్వరితగతిన పరిష్కరిం చేందుకు చేపట్టిన ఈ కార్యక్రమం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు కొనసాగింది .ప్రజల నుంచి మొత్తం ఐదు వినతులను అధికారులు స్వీకరించారు. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించినవి నాలుగు, హౌసింగ్ శాఖకు సంబంధించినది ఒకటి ఉన్నాయి. అందిన వినతులను సంబంధిత శాఖల అధికారులకు ఎంపిడిఓ సిహెచ్ గణేష్ పంపించారు. దరకాస్తుల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని,ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వర ప్రసాద్, ఎంపీఓ రామకృష్ణ రాజు, ఎంఈఓ మధు, వ్యవసాయ అధికారి అకు రాజ్ కుమార్ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బెల్ట్ షాపుల్లో అధిక ధరలకు మద్యం విక్రయాలు అరికట్టాలి

**-ఎంఆర్పి కంటే అదనంగా వసూలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి**

**-భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షులు దొబ్బల ప్రవీణ్ కుమార్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట ఆగష్టు 24 :** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని కొన్ని వైన్ షాపులు వారు సిండికేట్ విధానంలో బెల్ట్ షాపులకు వారికి మద్యం సరఫరా చేసే సమయంలోనే MRP కంటే సుమారు రూ.10 అదనంగా వసూలు చేస్తున్నారని, అనంతరం బెల్ట్ షాపుల నిర్వాహకులు ఆ అదనపు మొత్తంతో పాటు మరో రూ.30 వరకు కలిపి గ్రామాల్లో ఒక బీరు లేదా క్వార్టర్ బాటిల్‌పై రూ.30 నుంచి రూ.40 వరకు అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపిస్తూ జిల్లా కలెక్టర్‌కు భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షులు దొబ్బల ప్రవీణ్ కుమార్ వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా తను మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన వీక్రా ధరలకు మద్యం విక్రయించాల్సి ఉండగా, వైన్స్ షాపులు బెల్ట్ షాపులు గ్రామీణ ప్రాంతాల్లో వినియోగదారుల నుంచి ఇష్టారాజ్యంగా అధిక ధరలు వసూలు చేస్తున్న పరిస్థితి ఏర్పడిందని ,ఒక బీరు లేదా క్వార్టర్‌పై అదనంగా రూ.30-రూ.40 చెల్లించాల్సి రావడంతో కూలి పని చేసే వారు,రోజు వారి కార్మికులకు సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పడుతోందని అన్నారు.వైన్ షాపులు, బెల్ట్ షాపుల మధ్య జరుగుతున్న ఈ ధరల వ్యవహారంపై ఎక్సైజ్ శాఖ అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రజలకు తెలిసిన అవసరం ఉందని అన్నారు, ఇప్పటికి అయినా అధికారులు సమగ్రంగా విచారణ జరిపి, వీక్రా కంటే అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు అలాగే జిల్లాలో మద్యం విక్రయాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేసే విధానం, వసూలు చేస్తున్న ధరలు, గ్రామాల్లో విక్రయిస్తున్న ధరలను పరిశీలించాలని ప్రజల నుంచి అధిక ధరలు వసూలు చేయకుండా చూడాలని . పేద మధ్యతరగతి సామాన్య కూలి, కార్మిక వారి కుటుంబాలను రోడ్ పాలు కాకుండా చూడాలని అన్నారు,ఈ అంశంపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి సంబంధిత శాఖల అధికారులతో విచారణ చేయించి, తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసు కోవాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమం లో భీమ్ ఆర్మీ నాయకులు హరీష్ మహేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# వివాహితను బెదిరించి లైంగికంగా వేధించిన వ్యక్తి అరెస్ట్

**-రిమాండ్‌కు తరలింపు**




**చురకలు క్రైమ్ ప్రతినిధి, కరీంనగర్, ఆగస్టు 24 :** కరీంనగర్ రూరల్ మండల పరిధిలోని మమ్మక్కల్ గ్రామంలోని మధురానగర్‌కు చెందిన ఓ వివాహిత తన భర్త, పిల్లలతో కలిసి జీవిస్తోంది. గత ఆరు నెలలుగా సీతారాంపూర్‌కు చెందిన బైక్ మెకానిక్ మెడిదొడ్డి సాయికుమార్‌కు ఆమె కుటుంబంతో పరిచయం ఏర్పడింది.ఈ పరిచయాన్ని ఆసరాగా చేసుకున్న సాయికుమార్, సదరు వివాహితతో తరచుగా ఫోన్‌లో మాట్లాడటం, మెసేజ్‌లు చేయడం ప్రారంభించాడు. అనంతరం ఆమె భర్త ఇంట్లో లేని సమయంలో ఇంటికి వచ్చి, ఆమెను బెదిరిస్తూ తనతో మాట్లాడాలని, లేకపోతే చంపుతానని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొంది. అలాగే ఆమెను బ్లాక్‌మెయిల్ చేస్తూ పలుమార్లు బలవంతంగా శారీరకంగా వేధించినట్లు తెలిపింది.ఈ విషయం తన భర్తకు తెలిస్తే ఇబ్బందులు ఎదురవుతాయని బెదిరిస్తూ, ఆమెను భయభ్రాంతులకు గురిచేసినట్లు ఫిర్యాదులో పేర్కొంది. అయితే భార్య ప్రవర్తనపై అనుమానం వచ్చిన భర్త ఇంట్లో సీసీ కెమెరాను ఏర్పాటు చేయగా, సాయికుమార్ ఆమెను కలిసిన దృశ్యాలు రికార్డు అయ్యాయి.ఈ విషయం అనంతరం కుటుంబంలో వివాదం ఏర్పడటంతో భర్త తన కుమారుడిని తన వద్ద ఉంచుకుని, కుమార్తెను భార్య వద్దకు పంపినట్లు తెలిపారు. అనంతరం ఆమెకు న్యాయవాది ద్వారా కోర్టు నుంచి విడాకుల నోటీసు పంపించినట్లు తెలిసింది.సాయికుమార్‌ను ఈ విషయం పై ప్రశ్నించగా,తనకు అవసరమైనప్పుడు ఆమెను ఉపయోగించుకున్నానని,ఇకపై తన వద్దకు రావద్దని,ఎక్కడైనా చెప్పు కోవచ్చని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొంది. దీంతో బాధితురాలు కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.దర్యాప్తులో భాగంగా సాక్షులను,బాధితురాలి భర్తను విచారించి,సీసీ కెమెరాలో నమోదైన వీడియోను సేకరించారు.నిందితుడు సాయికుమార్ పరారీలో ఉండగా, సోమవారం గణేశ్‌నగర్‌లోని తన బైక్ మెకానిక్ షాపు వద్ద ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ఎ.నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు అక్కడికి వెళ్లి సాయికుమార్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిందితుడిని ఈరోజు కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించనున్నట్లు కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ఎ. నిరంజన్ రెడ్డి తెలిపారు.దర్యాప్తులో భాగంగా బాధితురాలిని కరీంనగర్‌లోని భరోసా సెంటర్‌కు పంపించి,అవసరమైన సహాయం అందించడంతో పాటు వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

# రోడ్డు ప్రమాద స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ

**-ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీసి సమగ్ర దర్యాప్తు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు**



**చురకలు ప్రతినిధి సిరిసిల్ల ఆగష్టు 24 :** చందుర్తి మండలం లింగంపేట గ్రామ పరిధిలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాద ఘటన స్థలాన్ని జిల్లా ఎస్పీమహేష్ బి.గితే అధికారులతో కలిసి సోమవారం రోజున క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు.ప్రమాదం ఎలా జరిగింది, రహదారి పరిస్థితులు, ఇతర సాంకేతిక అంశాలపై అధికారులను అడిగి తెలుసుకుని, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలను అన్ని కోణాల్లో విచారించి, సమగ్ర దర్యాప్తు చేపట్టాలని, దర్యాప్తును వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.వాహన దారులు అధిక వేగంతో వాహనాలను నడపడం వల్ల, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని ,ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటిం చాలని సూచించారు.ఎస్పీ గారి వెంట డిఎస్పీ శ్రీనివాసులు, సి.ఐ రవీందర్ ఉన్నారు.



# జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా అమరవేణి నర్సాగౌడ్



**చురకలు ప్రతినిధి,నిర్మల్,ఆగష్టు, 24 :** ఈరోజు హైదరాబాద్‌లోని జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో జాతీయ అధ్యక్షులు జాజుల.శ్రీనివాస్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన అమరవేణి నర్సాగౌడ్ ని రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. అమరవేణి నర్సాగౌడ్ గత 30 సంవత్సరాలుగా విద్యార్థి నేతగా ప్రస్థానం మొదలు పెట్టి మోకుదెబ్బ మాములు సభ్యుడి నుండి జాతీయ అధ్యక్షులు గా ఎదిగి తెలంగాణ సాధన ఉద్యమంలో ఎన్నో నిర్భందాలను ఎదుర్కొని ఉద్యమ నేతగా ఎదిగిన అసంఘటిత కార్మికుల పక్షాన పోరాటాలు నిర్వహించి ప్రజా ఉద్యమాలలో పనిచేసిన అమరవేణి నర్సాగౌడ్ బీసీ కులాలను ఐక్యం చేస్తున్నందున జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధక్షులుగా నియమించడం జరిగింది అని జాజుల.శ్రీనివాస్ గౌడ్ అన్నారు. అనంతరం అమరవేణి. నర్సాగౌడ్ మాట్లాడుతూ నన్ను రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమించినందుకు జాతీయ అధ్యక్షులు జాజుల.శ్రీనివాస్ గౌడ్ కు ప్రత్యేక ధన్యవాదములు తెలియజేస్తూ రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల వరకు బీసీ కులాలను ఐక్యం చేసి బీసీలకు రాజ్యాధికారం దక్కె విధంగా ఐక్య ఉద్యమాన్ని నిర్మించడానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా అధ్యక్షులు అనుముల భాస్కర్, మోకుదెబ్బ జాతీయ సెక్రెటరీ జనరల్ రాగుల.సిద్దిరాములు గౌడ్ పాల్గొన్నారు.

# మత సామరస్యంతో పండుగలు నిర్వహించుకోవాలి : సిరిసిల్ల డిఎస్పీ

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఆగష్టు 24 :** మిలాద్ ఉల్ నబి పండుగ సందర్భంగా సోమవారం రోజున సిరిసిల్ల డిఎస్పీ కార్యాలయంలో సిరిసిల్ల పట్టణ పరిధిలోని మతపెద్దలతో డిఎస్పీ నాగేంద్రచారి శాంతి సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ...ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో మతసామరస్యం ఉట్టిపడేలా పండుగలు నిర్వహించుకోవలని సూచించారు.ప్రజలంతా పండుగలను మతసామరస్యంతో జరుపుకునే విధంగా ఆయా మతాల పెద్దలు ప్రజల్లో సమన్వయం పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు.పండుగ ఏ మతానిది అయిన సామరస్యం, సోదరభావం సమాజంలో మంచి సంబంధాలను పెంపొందిస్తుందని తెలిపారు.మిలాద్ ఉల్ నబి పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా శాంతియుత వాతావరణంలో జరిగేలా మత పెద్దలు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే అసాంఘిక శక్తులపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేస్తున్నమని,ఎవరైనా గొడవలు సృష్టించేలా వ్యవహరిస్తే వెంటనే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని డిఎస్పీ తెలిపారు.ఈసమావేశంలో సిరిసిల్ల టౌన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్.ఐ గణేష్, మతపెద్దలు పాల్గొన్నారు.

# నిర్మల్‌లో ఏసీబీకి చిక్కిన అధికారులు



**చురకలు ప్రతినిధి,నిర్మల్, ఆగష్టు, 24 :** నిర్మల్ జిల్లా వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో సోమవారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఓ వ్యాపారి పన్ను తగ్గించడానికి డిసిటిఓ గోదావరి, సీనియర్ అసిస్టెంట్ మంత్రి సాయి కృష్ణ డబ్బులు చేశారు. లంచం ఇవ్వడం ఇష్టం లేక సదరు వ్యాపారి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. దీంతో ఇవాళ వారిని రూ.50 వేలు లంచం తీసుకుంటుండగా అధికారులు పట్టుకున్నారు.

# బాధితుల సమస్యలకు తక్షణ పరిష్కారానికి చర్యలు

**-జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 24 :** బాధితుల సమస్యలకు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటూన్నామని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 17 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పూర్తివివరాలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదు దారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి చట్టపరంగా బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని, ఫిర్యాదుదారునికి భరోసా, నమ్మకం కలిగించాలన్నారు. బాధితుల యొక్క ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.

# కాంగ్రెస్ హయాంలో విద్యా వ్యవస్థ సర్వనాశనం

**-మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 24 :** కాంగ్రెస్ హయాంలో విద్యా వ్యవస్థ సర్వనాశనం చేశారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రజా వ్యతిరేక విధానాలతో గత ప్రభుత్వ హయాంలోని గురుకుల వ్యవస్థను నాశనం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో 2,000పాఠశాలలు మూత పడి 1.26 లక్షల అడ్మిషన్లు తగ్గాయని, కేసిఆర్ హయాంలో 1,023 గురుకులాల్లో ఒక్కోవిద్యార్థిపై రూ.1.20 లక్షలు ఖర్చు చేసి నాణ్యమైన విద్య అందించామని, ఇప్పుడు గురుకులాల్లో కనీసం అన్నం కూడా పెట్టలేక 107 మంది విద్యార్థులు చనిపోయారని, యంగ్ ఇండియా స్కూల్స్ పేరుతో రూ.15,600కోట్లస్కామ్‌కు తెరలేపారన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద 236 స్కూళ్లకు రూ.250 కోట్లు, ఫీజు రీయింబర్స్ మెంట్ రూ.11,300 కోట్లు పెండింగ్ లో ఉన్నాయని, జీవో 97తో పాలిటెక్నిక్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని,ఆ జిఓను వెంటనే రద్దు చేయాలన్నారు.ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, లోక బాపు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వెల్గటూర్ ఉమ్మడి మండలంలో ఆటో డ్రైవర్ల నిరసన

**చురకలు, విలేఖరి, వెల్గటూర్, ఆగస్ట్ 24 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ ఉమ్మడిమండల ఆటో రిక్షా కార్మిక సంక్షేమసంఘం అధ్యక్షులు జూపాక కుమార్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ పిలుపు మేరకు, జగిత్యాల జిల్లా ఆటో యూనియన్ ఆదేశానుసారం సోమవారం ఆటోల యజమా నులు తమ ఆటోలను నిలిపి వేసి స్వచ్ఛందంగా బందు పాటించి నిరసన తెలిపారు. ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి 12వేలు ఇచ్చి ఉపాధి కల్పిస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చలేదని, మహా లక్ష్మి పథకంతో మహిళలకు ఫ్రీ బస్ పెట్టి ఆటో డ్రైవర్ల కడుపు కొట్టారాని,రాబోయే రోజుల్లో ఎలక్ట్రికల్ ఆటోలను రోడ్లపై తింపే అవకాశాలు ఉన్నందు న ఈ నిరసన చేపట్టడం జరిగిందని తెలిపారు.ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని,ఫ్రీ బస్ ఎత్తివేయాలని, ఎలక్ట్రిక్ ఆటోలను తింపే ఆలోచన విరమించుకోవాలని,పెట్రోల్, డీజిల్, ఆటోల చార్జీలు పెంచు కునే వెసులు బాటు కల్పించా లనిడిమాండ్ చేశారు ఒకవేళ ఇలాగే కొనసాగితే, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతా మనిహెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిలివేరి తిరుపతి, బిడారి శ్రీనివాస్, పోరండ్ల శేఖర్, సంఘ శ్రీనివాస్, మూగల భాను, బైరం శ్రీనివాస్, బోరే రమేష్, గాదాసు లక్ష్మణ్, అనుమాల నారాయణ, కుసనపల్లి దుర్గయ్య, పంజాల రాజేందర్,పిట్టల సంతోష్, పొన్నం వెంకటేష్,కొల్లూరి నరేందర్, బాదం సత్తయ్య,చింతకింది సత్యం, సింగం రమేష్,క్యాతం విద్యాసాగర్, వేల్పుల గంగారం, సలాది ప్రవీణ్, గడ్డం రవి, గౌరిశెట్టి భూపతి, బెత్తెపు రాజారావు, మేకల సాగర్, ఎర్ర గోకుల నరేష్, సలాది మల్లేష్, గాదాస్ రాజేశం, లక్కం ప్రశాంత్,చిప్పరి ప్రశాంత్, లక్కం శ్రీకాంత్,లక్కం చందు, బొమ్మగాని ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.



# మండల ప్రజావాణికి స్పందనేది?

**-వెల్గటూర్‌లో కేవలం 3 పిర్యాదుల స్వీకారం**

**చురకలు, విలేఖరి, వెల్గటూర్, ఆగస్ట్ 24 :**

జగిత్యాల జిల్లా వెల్గటూర్ ఎంపిపి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల ప్రజావాణి కార్యక్రమంలో కేవలం మూడు పిర్యాదులు మాత్రమే వచ్చాయి. అవి కూడా భూమి సమస్యలకు సంబందించినవే కావడం విశేషం. మండలంలో ఎన్నో సమస్యలు ఉన్నప్పటికీ ప్రజావాణి కార్యక్రమం లో పిర్యాదు చేయడానికి ప్రజలు ఎందుకు రావడంలేదో తెలియని పరిస్థితి,ప్రజావాణి నిర్వాహకులు విసతృత ప్రచారంతోపాటు సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తే ప్రజల్లో స్పందన పెరిగే అవకాశం ఉన్నందున తగు చర్యలు తీసుకుంటే మంచిది. ఈ కార్యక్రమంలో మండల ప్రజావాణి అధికారిఎంపీడీఓ,పి వెంకట్ ప్రసాద్, తహశీల్దార్ శేఖర్,ఏఓసాయికృష్ణ, ఎంఈఓ,పశువైద్యాధికారి, తదితరులు పాల్గొన్నారు.



# పట్టాలు సరే... స్థలాలు ఎక్కడో చూపించండి సారు..

**-ఆర్డిఓను కోరిన గ్రామస్తులు**



**చురకలు విలేకరి,మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 24 :** గత మూడు సంవత్సరాల క్రితం ఇందిరమ్మ ఇండ్ల కోసం పట్టాలు ఇచ్చిన నేటికీ స్థలాలు చూపించలేదని ఇప్పటికైనా స్థలాలను కేటాయించి తమకు న్యాయం చేయలాని ఆర్డిఓ నర్సింహా ను గ్రామస్తులు కోరారు.సోమవారం మండలంలోని ప్రజావాణి కార్యక్రమంలో బాగంగా కోనరావుపేట గ్రామాల్లో ఇండ్ల కోసం లబ్ధిదారులకు పట్టాలను పంపిణి చేయాగ వాటికీ సంబదించిన స్థలాలను చూపించాలని ఆర్డీఓ నర్సింహ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ 2009లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం కొనుగోలు చేసిన భూమిలో గత మూడు సంవత్సరాల క్రితం ఇళ్ల స్థలాల పట్టాలు లబ్ధిదారులకు పంపిణీ చేయగా నేటికీ పట్టాలకు సంబంధించి స్థలాలు లబ్దిదారులకు చూపించలేదాని తెలిపారు. స్థలాలను కేటాయించడంతో రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజురుకైనా అవకాశం ఉంటుందాని లబ్ధిదారులు కోరారు.దీనిపై సానుకూలంగా స్పందించిన ఆర్డీఓ వీలైనత త్వరగా సమస్యను పరిష్కరిస్తాణి లబ్ధిదారులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మారు గంగారెడ్డి, ఉపసర్పంచ్ జక్కని పరందాములు, గ్రామ లబ్ధిదారులు పాల్గొన్నారు.

# హెచ్‌ఎంను సన్మానించిన విద్యాశాఖ కార్యదర్శి




**చురకలు విలేకరి, జగిత్యాల, ఆగస్టు 24 :** తెలంగాణ రాష్ట్రంలో ఉన్న స్కూల్ కాంప్లెక్స్ పాఠశాలల్లో బెస్ట్ పెర్ఫార్మెన్స్ కలిగిన జగిత్యాల ఓల్డ్ హై స్కూల్ కాంప్లెక్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళను సోమవారం హైదరాబాద్ శిల్పకళా వేదిక లో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ల సమావేశంలో పాఠశాల విద్యా శాఖ కార్యదర్శి యోగితా రానా, పాఠశాల విద్యా శాఖ కమిషనర్ నవీన్ నికోలస్ సన్మానించారు. ఈ సందర్భంగా చంద్రకళను పలువురు ఉపాధ్యాయులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

# వృద్ధురాలి మృతి కేసులో ఒకరి అరెస్టు

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 24 :** జగిత్యాల రూరల్ తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బడుగు దుబ్బరాజు (60) ఆదివారం ఉదయం 4. గంటలకు గొల్లపల్లి రోడ్డులోని తాతమ్మ గుడిలో పనికి వెళ్తుండగా అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. సంఘటన స్థలాన్ని జగిత్యాల డీఎస్పీ పురుషోత్తం, జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్ పరిశీలించారు. జగిత్యాల రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా, ఇస్లాంపురకు చెందిన మహ్మద్ సమీఉద్దీన్ (42) మద్యం మత్తులో పల్సర్ బైక్ టిఎస్ 02 ఈఎం 5249 పై ఢీకొట్టి పారిపోయినట్లు తేలింది. జగిత్యాల పట్టణంలోని బీట్ బజార్ లో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు మద్యం సేవించినట్లు అజాగ్రత్తగా వాహనం నడుపుతూ మృతిరాలిని ఢీకొట్టినట్లు నిందితుడు విచారణలో ఒప్పుకున్నట్లు తెలిపారు. అతని బైక్ స్వాధీనం చేసుకొని, సోమవారం నిందితుడిని కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ ఉమాసాగర్ తెలిపారు.

# మరుభూమికి మానవత్వం నేర్పిన మహోన్నతుడు ముహమ్మద్ ప్రవక్త

నేడు (మిలాదున్నబి) మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మాయోపాయం పన్న కూడదు... వంచన, కుట్రలకు పాల్పడకూడదు... విశ్వాస భంగం చెయ్యకూడదు... ఊహ తెలియని పిల్లలను చంపకూడదు... స్త్రీలను, వృద్ధులను చంపకూడదు... చిత్రవధ చెయ్యకూడదు...

**ఖర్జూరపు చెట్లను, ఫలాలనిచ్చే చెట్లను నష్టం చేకూర్చకూడదు...**

ఇవీ ప్రవక్త ముహమ్మద్(స) యుద్ధమైదానంలో పాటించాల్సిందిగా తన అనుచరులకు నేర్పిన యుద్ధ నియమాలు. బహుశా ప్రపంచ చరిత్రలో ఏ నాయకుడూ యుద్ధమైదానంలో పాల్గొనబోయే తన సైన్యానికి ఇలాంటి యుద్ధ నియమాలను పాటించమని బహుశా చెప్పి ఉండడేమో!తన ప్రాణ శత్రువులు తనను, తన అనుచరుల్నీ చంపటం కోసం యుద్ధానికి కాలుదువ్విన సందర్భాల్లో సైతం వారిని సమాధాన పరచి యుద్ధం జరగకుండా ఆపటానికి అనేక విధాలుగా ప్రయత్నించినప్పటికీ.. తమపై యుద్ధం చెయ్యటానికి సిద్ధపడిపోయిన శత్రువుల నుండి ఆత్మరక్షణ కోసం తప్పనిసరిగా యుద్ధం చెయ్యాల్సి వచ్చినప్పుడు సైతం యుద్ధ మైదానంలో పాటించాల్సిన నైతిక నియమాలు నేర్పాడాయన. యుద్ధ మైదానంలో తన శత్రువులు రాక్షసత్వం ప్రదర్శిస్తున్న నేపథ్యంలో సైతం యుద్ధ భూమికి మానవత నేర్పాడాయన.చివరకు యుద్ధాన్ని మానుకున్న శత్రువులను క్షమించి వదిలి పెట్టి వారి పట్ల అమితమైన దయను చూపాడాయన."ప్రవక్త ముహమ్మద్ (స) అనేక యుద్ధాలు చేశారు" అని చాలా మంది చెప్పే మాట నిజానికి అవాస్తవం. ఎందుకంటే సాధారణంగా ఏ నాయకుడైనా మరొక రాజ్యాంపై తన తరఫున యుద్ధం ప్రకటించేది రాజకీయ, ఆర్థిక లబ్ధి కోసమే తప్ప మరొక ఉద్దేశం ఉండదు.కానీ, ప్రవక్త ముహమ్మద్ (స) చేసిన యుద్ధాలన్నీ కేవలం ఆత్మ రక్షణ కోసం మరియు దౌర్జన్య పరుల ద్వారా అణచబడి, వారి రాజకీయ ఆధిపత్యం క్రింద నలిగిపోతున్న సామాన్య అమాయక ప్రజలను రక్షించటం కోసం మాత్రమే ఆయనకు యుద్ధం చెయ్యమన్న ఆదేశాలు వచ్చాయి.తప్పితే ఇస్లాం మిడిమిడి జ్ఞానం కలిగిన కొందరు చెబుతున్నట్లు ప్రవక్త ముహమ్మద్ (స) చేసిన యుద్ధాలన్నీ ఇస్లాం వ్యాప్తి కోసమో, ఇతర మతాల ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి బలవంతంగా మతమార్పిడి చెయ్యటానికో, అన్యాయంగా ముస్లిమేతరులను చంపటానికో కాదు.ఇస్లామోఫోబియా అనే మానసిక జబ్బు కారణంగా ప్రవక్త ముహమ్మద్ (స) యుద్ధాలు చేశారన్న సమాచారం మాత్రమే కొందరి కళ్లకు కనపడుతుంది. తప్పితే ప్రవక్త ముహమ్మద్ నేర్పిన ధర్మాన్ని అనుసరిస్తున్నారన్న కారణంతో ఆయన శత్రువులు ఆయన యొక్క ఎందరో అనుచరుల శరీరాలు చీల్చి కాలేయాలు బయటకు లాగి, మండుతున్న ఇసుకలో పడుకోబెట్టి బల్లాలతో పొడిచి వారి శరీరాలను ఛిద్రం చేసి దారుణంగా హింసించి చంపిన సంఘటనలు కనపడవు.అలాంటి దౌర్జన్యపరులను సైతం తాను మక్కాను జయించిన సందర్భంలో వారి పట్ల పగా ప్రతీకారాలు తీర్చుకునే అవకాశం మెండుగా ఉన్నప్పటికీ వారందరినీ క్షమించివేశాడా మనిషి.అలాగే చరిత్రలో మొట్టమొదటిసారిగా యుద్ధం చేసిన ప్రవక్త ఒక్క ముహమ్మద్ (స) మాత్రమే కాదు! అలాగే ఆయనొక్కరికే మొట్టమొదటిసారిగా యుద్ధాలు చెయ్యమన్న ఆదేశాలు కూడా రాలేదు. చరిత్రలో దౌర్జన్య పరులకు వ్యతిరేకంగా ధర్మ యుద్ధాలు చెయ్యాల్సిందిగా ఆదేశించబడ్డ అనేక మంది మహాత్ములు, మహనీయులు, ప్రవక్తలున్నారు.అది తెలియాలంటే చరిత్ర చదవాలి, ఇంకా హిందూ శాస్త్రాలను, బైబిల్ గ్రంథాన్నీ క్షుణ్ణంగా పరిశీలించాలి. కేవలం వాట్స్ యాప్ మెస్సెజులు మటుకు చదివితే సరిపోదు.

**ముఫ్తి మహమ్మద్ ఫియాస్ మొహియుద్దీన్**

**మజ్లిస్ తహఫుజ్ ఖత్మే నబువ్వత్ రిలీజియస్ ట్రస్ట్ అధ్యక్షులు కరీంనగర్**



# వరాల దేవుడు ఆదివారా స్వామి



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఆగస్టు 24 :** వరాల దేవుడు ఆదివార హస్వామి అని రాష్ట్రఐటీ పరిశ్రమల శాఖమంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు అన్నారు.కమాన్‌పూర్ మండల కేంద్రం లోని శ్రీఆదివరహస్వామి జయంతి ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు హాజరయ్యారు.శ్రీధర్ బాబును ఆలయ చైర్మన్ ముస్త్యాల దామోదర్ ఆలయ ఈవో కొసన్న కాంతారెడ్డి, ఆలయ అర్చకులు కలకుంట్ల వర ప్రసాద్లు పూర్ణ కుంభాభిషేకంతో శ్రీధర్ బాబును ఆహ్వానించారు. అనంతరం స్వామివారి వద్ద గోపూజలో పాల్గొని అనంతరం అభిషేకం చేసి పూజలను నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ... శ్రీఆదివరహ స్వామికి ఎంతో చరిత్రఉందని ముక్కులు మొక్కుకున్న వారి మొక్కులుతీర్చే దేవుడు ఆదివారహస్వామి అని పేర్కొన్నారు. అలాగే ఆలయ అభివృద్ధిలో తమ వంతుగా పూర్తిస్థాయిలో కృషి చేస్తానని అన్నారు.ఆలయానికి రోడ్డు అసంపూర్తి గా ఉందని ఆలయ చైర్మన్ ముస్త్యాల దామోదర్ దామోదర్ తోపాటు ఆలయ ఈవో కాంతారెడ్డి ,డైరెక్టర్లు తీగల రాజయ్య, పిల్లి రాజు,శ్రీనివాస్ గౌడ్, బూస శ్రీనివాస్ గౌడ్,తిమ్మరాజు గిరిజ, బొజ్జ సతీష్,చాట్ల రాయమల్లు గాజుల శ్రీనివాస్ కుందారపు శంకర్ తాళ్ల భాగ్యలక్ష్మి అన వీణ శ్యామలలు రోడ్డు అసంపూర్తిగా ఉందని తమ దృష్టికితేగా వెంటనే 90 లక్షల వ్యయంతో రోడ్డు పనులు పూర్తి చేయడం జరిగిందని పేర్కొన్నారు.ఆలయాభివృద్ధిలో భాగస్వామి అవుతానని పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం మరింత సౌకర్యాలు కలిగేలా చూస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అన్వర్, నాయకులు రెబల్ రాజు, కోలేటి మారుతి, పిల్లి శేఖర్, బొల్లెపల్లి శంకర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ ఏసీపీ కార్యాలయంలో

# వార్షిక తనిఖీ నిర్వహించిన సిపి గౌష్ ఆలం

**చురకలు, క్రైమ్ ప్రతినిధి, కరీంనగర్ , ఆగస్టు 24 :** కరీంనగర్ నగరంలోని ట్రాఫిక్ ఏసీపీ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం సోమవారం వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ నిర్వహణ, వివిధ విభాగాల పనితీరు, సిబ్బంది విధుల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు.వార్షిక తనిఖీలో భాగంగా కార్యాలయంలోని రికార్డులు, రిజిస్టర్లు, కేసుల వివరాలు, ట్రాఫిక్ నిర్వహణకు సంబంధించిన రికార్డులు, సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించిన పోలీస్ కమిషనర్, సంబంధిత



అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ట్రాఫిక్ సమస్యలు, ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, వాటిని సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.నగరంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ రద్దీ, జామ్‌లు ఏర్పడకుండా ముందస్తు ప్రణాళికతో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని, అవసరమైన ప్రాంతాల్లో సిబ్బందిని సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. రోడ్డు భద్రతా నిబంధనలు ఉల్లంఘించే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.అలాగే ట్రాఫిక్ సిబ్బంది ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, నగర ట్రాఫిక్ నిర్వహణను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేయాలని పోలీస్ కమిషనర్ సూచించారు.ఈ వార్షిక తనిఖీలో ట్రాఫిక్ ఏసీపీ యాదగిరిస్వామితో పాటు సంబంధిత సీఐలు, సంజీవ్ కుమార్, అంజయ్య, ఎస్సైలు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## హుజురాబాద్లో..జర్నలిస్టుల

# నివాస స్థలాల సమస్య పరిష్కరిస్తా



**-కాంగ్రెస్ నేత వొడితల ప్రణవ్**

**-జర్నలిస్టుల దీక్షల విరమణ**

**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఆగస్టు 24 :** ప్రజా ప్రభుత్వంలో జర్నలిస్టులకు పెద్ద పీట వేస్తున్నామని, స్థానిక పాత్రికేయుల నివాస స్థలాల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ హామీ ఇచ్చారు. సోమవారం స్థానిక పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో రిలే నిరాహారదీక్ష శిబిరాన్ని ప్రణవ్ సందర్శించారు. నిమ్మరసం ఇచ్చి రిలే నిరాహారదీక్షలను విరమింపజేశారు. స్థానిక కేసీ క్యాంపులో జర్నలిస్టులకు ప్రభుత్వం రెవెన్యూ శాఖ అధికారికంగా నివాస స్థలాలు ఇవ్వగా.. కాంగ్రెస్ నేత గూడూరు స్వామి రెడ్డి కోర్టుకు వెళ్లిన విషయం తెలిసిందే. కోర్టులో వేసిన కేసును ఉపసంహరించుకోవాలని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గత వారం రోజులుగా జర్నలిస్టులు ఆందోళన నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ నేత ప్రణవ్ ఈ సమస్యపై జర్నలిస్టులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన స్థలాలకు సంబంధించిన విషయంలో న్యాయపరమైన ఇబ్బందులు కలగకుండా చూస్తామని, జర్నలిస్టులను తమ ప్రభుత్వం ఆదుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, పట్టణ, మండల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# హుజురాబాద్ మండలంలో.. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**-బాధితులకు చెక్కులు అందజేసిన కాంగ్రెస్ నేత వొడితల ప్రణవ్**

**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఆగస్టు 24 :** ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఇంటికి కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాన్ని అందజేస్తున్నామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. సోమవారం మన ఊరు – మన కాంగ్రెస్ –మన ప్రణవ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిధిలోని 16 గ్రామాల్లో 16 లక్షల



విలువ చేసే 46 సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధితుల ఇళ్లకు వెళ్లి అందజేశారు .అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ. సంక్షేమంతో పాటు అభివృద్ధికి నిధుల మంజూరుకు నిరంతరం మంత్రులతో, అధికారులతో మాట్లాడుతున్నామని, గ్రామాలలో పర్యటిస్తున్న సందర్భంగా పలు సమస్యలు గ్రామస్తులు తమ దృష్టికి తీసుకు వస్తున్నారని వాటి పరిష్కరించడానికి కృషిచేస్తున్నామని అన్నారు. పలు గ్రామాల్లో ఇందిరమ్మ గృహ ప్రవేశాలను పరిశీలించి, ఇందిరమ్మ ఇళ్ల నూతన గృహ ప్రవేశాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, జిల్లా అధికార ప్రతినిధులు, హుజురాబాద్ మండల అధ్యక్షుడు కొలుగూరి కిరణ్, సింగిల్ విండో చైర్మన్ సుగుణాకర్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.